క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందనలు



వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ శిక్షణ తీసుకొని జిల్లా స్థాయి సీఎం పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మేయర్ గుండు సుధారాణి అభినందించారు. వరంగల్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులను ప్రశంసించి బ్యాడ్మింటన్ బ్యాట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈనెల 29నుంచి హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయిలో పోటీల్లో గెలుపొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



హన్మకొండ అర్బన్: నగరంలోని భవిష్య స్కూల్‌లో ది ఇంటర్నేషనల్ కుంగ్ ఫూ - కరాటే ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంగ్ ఫూ, కరాటే పోటీల విజేతలకు రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈవీ.శ్రీనివాస్ ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అకాడమీ మాస్టర్లు ఎం.విజేందర్, అడ్లూరి గౌతమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకులపై దాడి సరికాదు

కాశిబుగ్గ: ఇళ్లు లేని నిరుపేదలను సమీకరించి భూపోరాటం చేస్తున్న సీపీఎం నాయకులపై కొందరు బీఆర్ఎస్ నాయకుల అనుచరులు చేసిన దాడి సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. భూమి లేని నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం వారం రోజులుగా శివనగర్ 321 సర్వే నంబర్‌లో సీపీఎం నాయకులు భూపోరాటం చేస్తుంటే, అది తట్టుకోలేని కొందరు బీఆర్ఎస్ నాయకులు తమ అనుచరులతో సీపీఎం నాయకులపై దాడికి ఉసిగొల్పుతున్నారని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



విద్యారణ్యపురి: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కృషి చేయాలని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి కోరారు. హనుమకొండలోని రాంనగర్‌లో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈక్రమంలో సైకిల్‌వాకర్స్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఆదివారం కూడా పర్యావరణంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అసోసియేషన్‌లో సభ్యులుగా చేరిన వారికి టీషర్ట్‌లను గోపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పులివెంట్ల అనంత్‌కుమార్, కోశాధికారి పెండ్లి రమేష్, బాధ్యులు వేణుగోపాల్, రాపర్తి లక్ష్మయ్య, సురేష్, శేఖర్‌గౌడ్, రాజు, యాదగిరి, రాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



హసన్‌పర్తి: వచ్చే నెల 1వ తేదీన మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న రెడ్డి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రెడ్డి జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోల్లో పొందుపరిచిన బీఆర్ఎస్ పార్టీ.. మాట తప్పిందని విమర్శించారు. సమ్మేళనానికి కుల బాంధవులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీసం కర్ణాకర్‌రెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, వీసం రవీందర్‌రెడ్డి, పాడి మల్లారెడ్డి, పెద్ది మల్లారెడ్డి, వీసం తిరుపతిరెడ్డి, అనిల్‌రెడ్డి, వీసం దేవేందర్‌రెడ్డి, తోకల ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జేడీపై రాజద్రోహం కేసు పెట్టాలి

కాశిబుగ్గ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించిన పార్లమెంట్ భవనం శవపేటికను పోలి ఉందని ట్వీట్ చేసిన రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ (ఆర్‌జేడీ)పై రాజద్రోహం కేసు పెట్టాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్ ఒక ప్రకటనలో తెలిపారు. 142 కోట్ల మంది పవిత్రంగా భావించే పార్లమెంట్‌ను గౌరవించాల్సింది పోయి శవపేటికతో పోల్చడం ఏమిటని పేర్కొన్నారు. ఆ పార్టీపై చర్య తీసుకోవాలన్నారు.

ప్రమాదకరంగా 'విద్యుత్ భవనం'

- 2015లో డివిజన్ కార్యాలయాల భవనం ప్రారంభం
- 8 ఏళ్లకే శిథిలావస్థకు చేరిన వైనం
- నాణ్యతలేని పనులతో అనతికాలంలోనే కాలం చెల్లిన భవన సముదాయం
- ఎప్పుడేం జరుగుతుందోనని భయాందోళనలో ఉద్యోగులు



పగుళ్లు బారిన డివిజన్ కార్యాలయాల భవనం



మరో పిల్లర్‌పై పగుళ్లు



గోడకు మరమ్మతులు

హన్మకొండ: నాణ్యతలేని పనులతో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందోననే భయాందోళనల మధ్య ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వందల ఏళ్ల పాటు పదిలంగా ఉంటూ వారసత్వ సంపదగా విరాజిల్లుతున్న భవనాలు నేటికీ కనువిందు చేస్తుండగా.. ప్రస్తుతం నిర్మిస్తున్న భవనాలు పట్టుమని పదేళ్లు కూడా నిలబడని దుస్థితి నెలకొంది. పర్సంటేజీలకు ఆశపడి అధికారులు, లాభాపేక్షతో కాంట్రాక్టర్.. వెరసి పనుల్లో నాణ్యత కొరవడుతోంది. దీంతో పలు కాలాల పాటు పదిలంగా ఉండాల్సిన భవనాలు స్వల్ప కాలానికే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

శిథిలావస్థలో డివిజన్ కార్యాలయాల సముదాయ భవనం

టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ నక్కలగుట్టలోని సూపరింటెండెంట్ కార్యాలయ ఆవరణలో డివిజన్ కార్యాలయాల సముదాయ భవనాన్ని నిర్మించారు. ఈ భవనం అయిదేళ్లకే శిథిలావస్థకు చేరుకోగా మరమ్మతులు చేసుకుంటూ వస్తున్నారు. ఒకవైపు మరమ్మతులు చేస్తుండగానే మరో వైపు భవనం నెర్రలుబాస్తోంది. ఈ డివిజన్ కార్యాలయాల భవన నిర్మాణానికి 2013, ఏప్రిల్ 26న అప్పటి ట్రాన్స్‌కో సీఎండీ హీరాలాల్ సమారియా శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్.. 2015లో పూర్తి చేయగా అదే సంవత్సరం సెప్టెంబర్ 9న అప్పటి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ భవనంలో విద్యుత్ హనుమకొండ టౌన్ (ఆపరేషన్), వరంగల్ రూరల్ (ఆపరేషన్), డీపీఈ, హనుమకొండ కన్‌స్ట్రక్షన్, ఎంఆర్‌టీ డివిజన్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ప్రారంభించిన అయిదేళ్లకే భవనంలో నిర్మాణ లోపాలు బయటపడ్డాయి. పనుల్లో నాణ్యత లేకపోవడంతో గోడలు పగులు బారుతున్నాయి. మూడేళ్ల నుంచి భవనానికి మరమ్మతులు చేస్తూ కార్యాలయాలు కొనసాగిస్తున్నారు. ఒక వైపు మరమ్మతులు చేస్తుండగా మరోపక్క నెర్రలు బాస్తూనే ఉన్నాయి. భవనం ముందు భాగంలో నిర్మించిన పిల్లర్ పగులుబాసి పడిపోవడానికి సిద్ధంగా ఉంది. ఎప్పుడు కూలుతుందోనని ఉద్యోగులు భయపడుతున్నారు. మరమ్మతులు చేస్తున్నా తట్టుకునే శక్తి లేకపోవడంతో భవనం పటిష్టతపై ఆందోళన నెలకొంది. నిర్మాణం పూర్తైన కొన్నేళ్లకే లోపాలు బయటపడినా కాంట్రాక్టర్‌పై, అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులు, ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. నాణ్యత లేని నిర్మాణాలు ప్రమాద కారకాలు అని తెలిసినా యాజమాన్యం చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తోందని విమర్శిస్తున్నారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం స్పందించి నాణ్యతలోపంగా భవన నిర్మాణానికి కారకులపై చర్య తీసుకోవాలని విద్యుత్ ఉద్యోగులు కోరుతున్నారు.

దళితులకు భూమి పంపిణీ చేయాలి



సభలో అభివాదం చేస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: దళితులకు భూమి పంపిణీ చేయకుండా, సెజ్‌ల పేరుతో కార్పొరేటర్ కంపెనీలకు వందలాది ఎకరాలు కట్టబెట్టడం మానుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ హెచ్చరించారు. వరంగల్ హంటర్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) ప్రథమ మహాసభ సంగీ ఎలేందర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ గతంలో దళితులకు పంపిణీ చేసిన భూమిని కూడా అభివృద్ధి పేరుతో వెనక్కి తీసుకుంటున్నారని విమర్శించారు. దళితులకు వంద గజాల ఇంటి స్థలం ఇవ్వటానికి రాష్ట్ర ప్రభుత్వం వెనుకంజ వేస్తోందని పేర్కొన్నారు. 1980లోని ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నియామకాల ప్రకారం జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ఎలేందర్

దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా సంగీ ఎలేందర్, ప్రధాన కార్యదర్శి జన్ను రవి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు గన్నారపు రమేష్, జాన్‌పాల్, బత్తుల సుప్రియ, మహేష్, మైదం యాకయ్య జన్ను రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దయాకర్‌రావును కలిసిన కమిషనర్ రిజ్వాన్ బాషా



వరంగల్ అర్బన్: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌ను గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా హనుమకొండ కలెక్టరేట్‌లో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, డివిజన్ కార్పొరేటర్ సిద్ధం రాజు సహకారంతో పార్టీ బలోపేతంతోపాటు డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ డివిజన్ నూతన అధ్యక్షుడు బోరిగం నర్సింగం అన్నారు. ఈమేరకు వరంగల్ 39వ డివిజన్ ఏకశిలనగర్‌లోని ఆయన స్వగృహంలో ఆయనను బీఆర్ఎస్ నాయకులు, మైనార్టీ మహిళా సంఘాల ప్రతినిధులు ఆదివారం కలిసి సన్మానించారు. ఎండీ.తాహెరా బేగం, గౌసియాబేగం, సుల్తాన పాల్గొన్నారు.

వడ్డెరుల సంక్షేమానికి పాటుపడాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

ఖిలా వరంగల్: వడ్డెర కులస్తుల సంక్షేమానికి మరింతగా పాటుపడాలని, నగరంలో ప్రత్యేక వడ్డెర కుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని వడ్డెర సంఘం నగర అధ్యక్షుడు ఓర్సు రాజు, రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు కోరారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డు పెరకవాడలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నరేందర్‌ను వారు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 9వేలకు పైగా వడ్డెరలు ఉన్నారని, ఈక్రమంలో జిల్లా కేంద్రంలో వడ్డెర సంఘం భవనం నిర్మించి ఇవ్వాలని కోరారు. వడ్డెరల ఎస్టీ సాధనపై జూన్‌లో వరంగల్, హనుమకొండలో వేర్వేరుగా వడ్డెరుల బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఓర్సు చిన్నఎల్లయ్య, మల్లయ్య, వల్లెపు రామస్వామి, ఓర్సు వెంకన్న, వెంకటమ్మ, శ్రీను, నాగరాజు, సంపత్, రవి, కోటి, రాజేష్, రాములు పాల్గొన్నారు.

బాలకృష్ణను కలిసిన అభిమానులు



ఖిలా వరంగల్: ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో ప్రముఖ హీరో నందమూరి బాలకృష్ణను వరంగల్‌కు చెందిన అఖిల భారత నందమూరి బాలకృష్ణ సంఘం కన్వీనర్ జీఎల్ శ్రీధర్, అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లకుంట రవికుమార్, జిల్లా ఆర్గనైజర్ నాగవల్లి సురేష్, రాంమూర్తిరెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలకృష్ణకు వారు పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎన్వీఎన్.చారికి ఎన్టీఆర్ స్మారక పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఎన్వీఎన్.చారి

హన్మకొండ కల్చరల్: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా బెంగళూరులోని సీపీ.బ్రౌన్ సేవా సమితి, స్వాతంత్ర్య సమరయోధుడు ఎడమకంటి బ్రహ్మారెడ్డి కార్మిక మండలి ఆధ్వర్యంలో హనుమకొండకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ ఎన్వీఎన్.చారికి ఎన్టీఆర్ స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. కర్ణాటక తెలుగు అకాడమీ, తెలుగు విజ్ఞాన సమితి సౌజన్యంతో బెంగళూరులోని మల్లేశ్వరం వయాలికావల్‌లోని శ్రీకృష్ణదేవరాయ కళామందిరంలో శనివారం జరిగిన సభలో పలు రంగాల్లో సేవలందించిన ప్రముఖులను సన్మానించారు. ఈ సందర్భంగా తారక రామ శతకం రాసినందుకు గాను ఎన్వీఎన్.చారిని ఘనంగా సన్మానించి పురస్కారాన్ని ప్రదానం చేశారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

వరంగల్: విశ్వవిఖ్యాత నటుడిగా, పరిపాలన దక్షుడిగా ఉమ్మడి తెలుగు రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ.రామారావు.. తెలుగువారి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప నాయకుడు అని ఎన్టీఆర్ అభిమాన సంఘం జిల్లా నాయకుడు పాశికంటి రమేష్ కొనియాడారు. వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిట్ట నగేష్ అధ్యక్షతన ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు లాసాని నర్సింగం, ముంద్రాతి శరత్, గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఆర్మూర్ కుమార్, ఈర్ల రాజేందర్, కొత్తపల్లి యాదగిరి, రమేష్ రెడ్డి, ఓర్సు అంజయ్య పాల్గొన్నారు.

హన్మకొండలో..

తెలంగాణ తెలుగుదేశం పార్టీ హనుమకొండ జిల్లా పశ్చిమ నియోజకవర్గం కోఆర్డినేటర్ రహీం ఆధ్వర్యంలో హనుమకొండ పెట్రోల్ పంపు దగ్గర ఉన్న ఎన్టీఆర్ శతజయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఉత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాబా ఖాదర్‌అలీ, బర్ల యాకూబ్, బి.ప్రభాకర్, శ్రీనివాస్, సంపత్‌కుమార్, చిలువేరు మహేందర్, మాడగాని మనోహర్, హరి దాస్యం సురేష్, అనిశెట్టి సతీష్, కటకం కుమారస్వామి, శివరాత్రి వెంకన్న, మహేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ చౌరస్తా: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా హనుమకొండ రాగన్న దర్వాజ వద్ద ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకుడు చీకటి రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాబా ఖాదర్ అలీ, శ్రీనివాసరెడ్డి, సాజిత్, సారంగపాణి, రాజు, వెంకన్న, రాజగోపి, అనిల్, రాజు, సురేష్, అమర్నాథ్ పాల్గొన్నారు.

జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలకు భూమి అప్పగించాలి

నయీంనగర్: వరంగల్ నగరంలోని కాకతీయ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ, ఏకశిల హౌసింగ్ సొసైటీలకు దశాబ్దం క్రితం ప్రభుత్వం కేటాయించిన భూములను సత్వరమే సొసైటీలకు అప్పగించి జర్నలిస్టుల సొంతింటి కలను నెరవేర్చాలని కాకతీయ, ఏకశిల జర్నలిస్టుల హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీలు విజ్ఞప్తి చేశాయి. ఈ విషయంలో జిల్లా మంత్రులు, ప్రతినిధులు చొరవ చూపాలని సొసైటీల ప్రతినిధులు కోరారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో కాకతీయ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు ఎం.రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన రెండు సొసైటీల ఉమ్మడి సమావేశం ఆదివారం జరిగింది. కాకతీయ జర్నలిస్టు హౌసింగ్ కోఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి సీహెచ్ సోమనర్సయ్య, ఉపాధ్యక్షుడు వి.రమేష్‌బాబు, డైరెక్టర్ బి.దయాసాగర్, ఏకశిల హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు పి.శివకుమార్, కార్యదర్శి బీఆర్ లెనిన్, కార్యవర్గ సభ్యులు గడ్డం కేశవమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు సొసైటీల బాధ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన స్థలాలను సొసైటీలకు అప్పగించాలని కొనేళ్లుగా ప్రభుత్వ పెద్దలకు పలుమార్లు విన్నవించుకున్నట్లు తెలిపారు. సొసైటీల్లో సభ్యులుగా లేని జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇప్పించేలా ప్రభుత్వ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి కృషి చేయాలని తీర్మానించారు. ఆ దిశగా చొరవ తీసుకోవాలని కోరారు.

ఇందిరానగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తా



ఇందిరానగర్‌లో మాట్లాడుతున్న చీఫ్‌విప్

హన్మకొండ చౌరస్తా: దళిత, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ పేరున త్వరలో కమ్యూనిటీ హాల్‌తో పాటు అందులో యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ 8వ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ప్రజలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. కార్మికులు రూ.110 చెల్లించి కార్మిక శాఖ గుర్తింపు కార్డు పొందాలని, తద్వారా అనేక సంక్షేమ ఫలాలు అందుకోవచ్చని వివరించారు. కార్మికుల సంక్షేమం కోసం ఈనెల 31వ తేదీన ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న యుద్ధభేరికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు డివిజన్‌లోని గుడిబండల్‌లో స్థానికుడు, సివిల్ జడ్జి ఉదయభాస్కర్‌రావు తన తండ్రి గరిగె నర్సింహరావు స్మారకార్థం నిర్మించిన భీంరావ్ కమ్యూనిటీ హాల్‌ను వినయ్‌భాస్కర్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నలుబోలు సతీష్, పులి విక్రమ్ చీకటి ఆనంద్, తాళ్లపెల్లి జనార్దన్‌గౌడ్, సిద్దోజు రమేష్, కూచన సునీల్, పున్నంచందర్, ప్రకాష్, ప్రభాకర్, శ్రీనివాస్, శ్రీధర్, ప్రదీప్, సంపత్ పాల్గొన్నారు.

చీఫ్ విప్‌ను కలిసిన మున్నూరుకాపు సంఘం నాయకులు

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ను మున్నూరుకాపు సంఘం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు ఆదివారం కలిశారు. ఇటీవల మున్నూరుకాపు సంఘం జిల్లా అడ్‌హాక్ కమిటీని ఎన్నుకున్నారు. హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త దశరథం ఆధ్వర్యంలో చీఫ్‌విప్‌ను సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

అంధత్వ నివారణే 'లయన్స్' లక్ష్యం



మాట్లాడుతున్న సునీల్‌కుమార్

హసన్‌పర్తి: అంధత్వ నివారణే లయన్స్ లక్ష్యమని క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ డైరెక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'సరిగమపదని' నేత్ర జ్యోతి కార్యక్రమాన్ని చింతగట్టుక్యాంప్ సమీపంలోని కేఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిసెంటర్‌లో, ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ద్వారా లక్షల శస్త్ర చికిత్సలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. తెలంగాణ వ్యాప్తంగా ఏడు స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అందులో ఒకటి వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కన్న పరశురాములు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పరిధిలోని 7జిల్లాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నట్లు వివరించారు. 'నేత్ర ప్రదానం (విజన్)' విభాగంలో ఉన్నత సేవలందించిన వారిలో ఉత్తములను సన్మానించారు. ఈ సందర్భంగా ఏకశిల పబ్లిక్ స్కూల్ జనగామం, ఆలేరు విద్యార్థులు సేకరించిన రూ.4,69,500 విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన దివ్యాంగుల సేవా సంస్థకు అందించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని రూపశిల్పి డాక్టర్ గట్టమనేని బాబురావును ఈ ఏడాది భారతదేశం నుంచి అంతర్జాతీయ డైరెక్టర్ ఎండార్సిగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.విద్యాసాగర్‌రెడ్డి, తీగల మోహన్‌రావు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జూలూరి రఘు, డాక్టర్ అజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో కుక్కల బెడద

- గుంపులుగా స్వైర విహారం
- భయాందోళనలో స్థానికులు
- పట్టించుకోని అధికారులు



శాంతినగర్ నుంచి రైల్వే కాలనీకి వెళ్లే మార్గంలో రాత్రివేళలో రోడ్డుపై కుక్కల గుంపు

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్‌లోని శాంతినగర్ – రైల్వే డీజిల్‌కాలనీలో కుక్కల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. డీజిల్ కాలనీ రైల్వే ఆలయం వెనక నుంచి శాంతినగర్‌కు వెళ్లే మార్గంలో వీధి కుక్కలు రాత్రి, పగలు అని తేడా లేకుండా స్వైరవిహారం చేస్తుంటాయి. ఈక్రమంలో ఆ మార్గంలో వెళ్లేందుకు శాంతినగర్ ప్రజలు, రైల్వే క్వార్టర్స్‌లలో నివాసం ఉండే వారు భయపడుతున్నారు. ఇటీవల కాజీపేట జంక్షన్ రైల్వే చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో ఓ సంచార కుటుంబానికి చెందిన ఏడేళ్ల బాలుడిని కుక్కల గుంపు అతి దారుణంగా దాడి చేసి చంపిన ఘటన తెలిసింది. ఈ క్రమంలో ఆ ఘటనతో కుక్కలను చూస్తేనే స్థానికులు భయంతో వణికిపోతున్నారు. బాలుడి ఘటనలో గ్రేటర్ మున్సిపల్ అధికారులు నామమాత్రంగా కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టి చేతులు దులుపుకున్నారని పలువురు విమర్శించారు. ఉన్నతాధికారులు, పాలకులు చొరవ తీసుకుని కుక్కల బెడదను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



భీమారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహణ కమిటీ అధ్యక్షుడు బండి కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో 1978 – 1979వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాల తరువాత పలువురు కుటుంబ సభ్యులతో కలిసి ఒకచోట కలిశారు. నాడు మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కుటుంబ వివరాలు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పిన ఆనాటి గురువులకు సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహాయం అందించారు. ప్రతిఏటా ఇలాగే కలుసుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో బెల్లంకొండ రమేష్, వేల్పుల రవీందర్, పాలకుర్తి సత్యనారాయణ, గుర్రం రవీందర్‌బాబు, నాగవెల్లి సుదర్శన్, తాళ్లపల్లి రవీందర్, సంపత్‌కుమార్, గురువులు నాగభూషణం, ఉపేందర్, మొగిలి, ఐలయ్య, వెంకట్రావు, నరసయ్య, శైలేందర్, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

ఎల్బీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హన్మకొండ అర్బన్: ఎల్బీ కళాశాలలో 1988 – 1991వ సంవత్సరంలో డిగ్రీ చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సుబేదారిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకచోట కలిసి నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిత్రులంతా కలిసి నిరుపేదలు, అనాథ వృద్ధులకు చేయూత నివ్వాలని తీర్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అపోలో ఆస్పత్రి గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, కేశవరెడ్డి, సుధారెడ్డి, జాకీర్ అలీ, శ్రవణ్, శ్రీదేవి, శ్రీనివాస్, రాధిక, అనుపమ, భవాని, గుంటి కుమార్, రవిచందర్, సురేష్, శ్రీధర్, రామ్మోహన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ఎల్బీ కళాశాల పూర్వ విద్యార్థులు

భీమారంలోని పాఠశాల విద్యార్థుల సమ్మేళనం

హసన్‌పర్తి: భీమారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (1997 –1998) సమ్మేళనం గోపాలపురంలోని సీవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. ప్రతి ఏడాది ఇలాగే వేడుకలు జరుపుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా తమ గురువులు సువర్ణ, సుధీర్‌బాబు, సుధాకర్, ఆర్.కమల, స్వరూప, వసంతను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చింతల కోటేశ్వర్, బండారి రమేష్, దాసరి మునీందర్, గడ్డం రమేష్, చింతల రమేష్, సుభాష్, నాగరాజు, థామస్, రమేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమమే ధ్యేయంగా..

హన్మకొండ కల్చరల్: బ్రాహ్మణుల సంక్షేమమే ధ్యేయంగా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యుడు భద్రకాళి శేషు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని గోపనపల్లిలో తొమ్మిది ఎకరాల్లో రూ.10 కోట్ల వ్యయంతో సనాతన ధర్మ ప్రచారకేంద్రంగా నిర్మించిన బ్రాహ్మణభవనం ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ తరలివెళ్లడానికి భద్రకాళి దేవాలయం మెయిన్ రోడ్ ఆర్చ్‌గేటు వద్ద బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 93902 38989 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. అధిక సంఖ్యలో బ్రాహ్మణ కులస్తులు తరలిరి వచ్చి విజయవంతం చేయాలని పేర్కొన్నారు.